ములుగు డీఐవోకు కలెక్టర్ అభినందనలు

ములుగురూరల్, ఏప్రిల్24 : ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగు జిల్లాను రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠితో పాటు అదనపు కలెక్టర్ శ్రీజ అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిపిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన ఇంటర్మీడియట్ శాఖ అధికారులు, అధ్యాపకులకు అభినందనలు తెలియజేశారు.

ఇంటర్మీడియట్ ఫలితాల్లో ములుగును రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానంలో నిలిపినందుకు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి వెంకటేశ్వర్‌ను అభినందిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు కలెక్టర్ శ్రీజ

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ కనబర్చిన వెంకటాపూర్ మండలానికి చెందిన విద్యార్థులు కంచు దివ్య, చీకుర్తి పూజితను అభినందిస్తున్న మంత్రి సీతక్క

సెకండియర్‌లో ఫస్ట్.. ఫస్టియర్‌లో థర్డ్

- ఇంటర్ ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో ములుగు జిల్లా ప్రభంజనం
- సత్తాచాటిన ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు

ములుగు ఏప్రిల్ 25 (నమస్తే తెలంగాణ) : రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు బుధవారం విడుదల చేసిన ఫలితాల్లో ములుగు జిల్లాకు చెందిన విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో చివరి జిల్లా అయిన ములుగు ఇంటర్ సెకండియర్ విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకొని రికార్డు సృష్టించగా ఫస్ట్ ఇయర్ విద్యార్థులు మూడో స్థానం కైవసం చేసుకున్నారు. గత ఏడాది కూడా సెకండియర్‌లో జిల్లాకు మొదటి స్థానం రాగా ఫస్టియర్‌కు నాల్గో స్థానం దక్కింది. రెండేళ్లుగా ఇంటర్ ఫలితాల్లో ములుగు జిల్లా రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించడంపై ప్రజలు హర్షం వ్యక్తంచేశారు. 2024లో ములుగు జిల్లా నుంచి ఫస్ట్ ఇయర్‌లో 70.01 శాతం, సెకండియర్‌లో 82.95 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. ఇందులో సెకండియర్‌లో 1,695 మంది పరీక్షలు రాయగా 1,406 మంది, సెకండియర్ ఒకేషనల్ విభాగంలో 233 మందికి 183 మంది ఉత్తీర్ణత సాధించారు. ఫస్టియర్‌లో 1,717 మందికి 1,202 మంది, ఫస్టియర్ ఒకేషనల్‌లో 233 మందికి 183 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫలితాల్లో బాలుర కంటే బాలికలే అధిక శాతం ఉత్తీర్ణులయ్యారు. ఫస్టియర్‌లో 888 మంది బాలురు పరీక్షలు రాయగా 553 మంది (62.27 శాతం) పాసయ్యారు. బాలికల విభాగంలో 829 మందికి 649 మంది (78.29 శాతం) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరంలో 928 మంది బాలురకు 729 మంది (78.56శాతం) ఉత్తీర్ణత సాధించారు. బాలికల విభాగంలో 767 మందికి 677 మంది (88.27శాతం) పాసయ్యారు.

ఏటూరునాగారం గురుకుల కళాశాలలో 93శాతం ఉత్తీర్ణత

ఏటూరునాగారం : ఇంటర్ ఫలితాల్లో గిరిజన గురుకుల కళాశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో 93శాతం, ప్రథమ సంవత్సరంలో 52శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. జీ వీరన్న బైపీసీలో 900 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలువగా, ఎంపీసీలో ఎం అనిల్ 896 మార్కులు సాధించారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకుచెందిన బైపీసీ విద్యార్థిని పీ శృతి 898 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచినట్లు ప్రిన్సిపాల్ భగవద్గీత తెలిపారు. ఎంపీసీలో జీ సాయి మిథున్ 888 మార్కులు, ఫస్టియర్ ఎంపీసీలో ఈ కీర్తన 443 మార్కులు, బైపీసీలో విజయంత్ 391 మార్కులు సాధించినట్లు తెలిపారు.

మంగపేట జూనియర్ కాలేజీ జిల్లా టాప్

మంగపేట : ఇంటర్ మీడియట్‌లో ములుగు జిల్లా స్థాయిలో మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల మొదటి స్థానంలో నిలిచినట్లు ప్రిన్సిపాల్ గూళ్ల వెంకటయ్య బుధవారం తెలిపారు. ద్వితీయ సంవత్సరంలో షేక్ సనా 967 మార్కులు సాధించి జిల్లా ప్రథమ స్థానంలో నిలువగా, దీగొండ సత్యవర్ధన్ 958 మార్కులతో ద్వితీయ స్థానంలో నిలిచినట్లు చెప్పారు. ప్రథమ సంవత్సరంలో 80 మంది విద్యార్థులు హాజరు కాగా 68 మంది విద్యార్థులు ఉతీర్ణులై 85 శాతం, ద్వితీయ సంవత్సరంలో 112 మంది విద్యార్థులు హాజరుకాగా 110 మంది విద్యార్థులు ఉతీర్ణులై 98.2 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు వివరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను అధ్యాపకులు రేణుకాదేవి, జ్యోతిర్మయి, సంతోష్ కుమార్, లక్ష్మణ్, అనిల్‌కుమార్, రవీంద్ర నాయక్, శ్రీనివాస్, చిరంజీవి, రాజు, వైష్ణవి, వందన అభినందించారు.

కేజీబీవీ విద్యార్థుల ప్రతిభ

వెంకటాపురం (నూగూరు) : వెంకటాపురం కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులు ద్వితీయ సంవత్సరంలో సీఈసీలో త్రివ్యశ్రీ 840 మార్కులు సాధించినట్లు ఎస్‌వో తెలిపారు. ప్రథమ సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో నాగవర్శిని 469, నాగశ్రీ 447 మార్కులు సాధించారన్నారు.

సత్తాచాటిన విద్యార్థులు

ములుగురూరల్ / గోవిందరావుపేట : ములుగు మండలం జగ్గన్నపేట ప్రభుత్వ గిరిజన మహిళా జూనియర్ కళాశాలకు విద్యార్థులు మొదటి సంవత్సరం ఎంపీసీలో బీ దివ్య 390, ఎల్ అనిత 383, బైపీసీలో జీ శారద 388, ఎం మమత 353, సీఈసీలో జీ అఖిల 407, బీ –దివ్య 391 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో బీ సుమలత 889, బీ సరిత 856, బైపీసీలో బీ ప్రత్యూష 883, ఎస్ లలిత 870, సీఈసీలో ఎల్ శ్రీఆంజలి 791, జీ విజయ 778 మార్కులు సాధించి కాలేజీ టాపర్లుగా నిలిచినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. అలాగే బండారుపల్లి మోడల్ కళాశాలకు విద్యార్థులు ఎంపీసీలో జీ స్ఫూర్తి 457, బైపీసీలో ఎం ఐశ్వర్య 425, సీఈసీలో కే గ్రీష్మ 414 మార్కులు సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో సీహెచ్ శృతి 956, బైపీసీలో సీహెచ్. భవ్య 966, సీఈసీలో కే కవిత 846 మార్కులను సాధించినట్లు ప్రిన్సిపాల్ శోభారాణి చెప్పారు. గోవిందరావుపేట ప్రభుత్వ కళాశాల మొదటి సంవత్సరం ఎంపీసీలో గోరంట్ల నిరాజ్ 456 సాధించారు. ద్వితీయ సంవత్సరంలో ఎండీ సమీరా, ఎండీ షబానా 958 మార్కులు సాధించారు. అలాగే కస్తూర్బా, మోడ ల్ పాఠశాల విద్యార్థులు సైతం జిల్లా స్థాయిలో 2వ ర్యాంకు సాధించారు.

జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో..

భూపాలపల్లి రూరల్/ చిట్యాల/ మహదేవపూర్/ టేకుమట్ల/ కాటారం, ఏప్రిల్ 24 : ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని ద్వితీయ సంవత్సరం 69.89 శాతం, ప్రథమ సంవత్సరం 58.61శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఇంటర్మీడియట్ జిల్లా నోడల్ అధికారి కే దేవరాజం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సెకండియర్‌లో జనరల్ విద్యార్థులు 1,415 మంది హాజరు కాగా 989 మంది, ఒకేషనల్‌లో 219 మందికి 157 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారన్నారు. ఫస్టియర్ జనరల్ విద్యార్థులు 1,457 మందికి 854 మంది, ఒకేషనల్‌లో 255 మంది హాజరు కాగా 146 మంది పాసయ్యారన్నారు. రాష్ట్ర స్థాయిలో సెకండియర్‌లో జిల్లా 8వ స్థానం, ఫస్టియర్‌లో జిల్లా 11వ స్థానంలో నిలిచిందన్నారు. చిట్యాల ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి ఉడుత అజయ్ సెకండియర్ ఎంపీసీలో 978, మహదేవపూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థిని ఎండీ సానియా 911, ప్రథమ సంవత్సరం ఎంపీసీలో జీ మాధురి 463, ఆర్ చాందిని 438, సీహెచ్ వర్ధన్ 432 మార్కులు సాధించారని తెలిపారు.

జిల్లా కేంద్రంలోని మైనార్టీ విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించారని ప్రిన్సిపాల్ టీ వెంకటేశ్వర్లు తెలిపారు. మైనార్టీ కళాశాలలో ద్వితీయ సంవత్సరం ఎంపీసీ లో బీ రాజ్‌కుమార్ 960, ఏ మల్లికార్జున్ 957, అబ్దుల్ ఫైస ల్ 956, బీ సాత్విక్ 953, బైపీసీ విభాగంలో ఎండీ ఫారుఖ్ బేగ్ 930, ప్రథమ సంవత్సరం బైపీసీ ఫలితాల్లో ఎం సాయితేజ్ 432, ఎండీ సాబీర్ పాషా 424, ఎంపీసీలో ఎండీ వసీమ్ మహ్మద్ 450, ఎస్ వివేక్ 447, ఎండీ రఫీ 432, జీ అక్షయ్ పాల్ 428 మార్కులు సాధించారని తెలిపారు. మహదేవపూర్ మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థులు ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 117 మంది పరీక్షలు రాయగా 90 మంది, ద్వితీయ సంవత్సరంలో 103 మందికి 70 మంది ఉత్తమ ఫలితాలను సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ నర్సయ్య తెలిపారు.ప్రథమ సంవత్సరంలో జిల్లా టాపర్‌గా ఎంపీసీ విభాగంలో సీహెచ్ రవీందర్ 432, బైపీసీలో టీ సదాశివ్ 382, సీఈసీలో డీ అజయ్ 349, హెచ్‌ఈసీలో సీహెచ్ రేష్మ 296, వొకేషనల్‌లో ఎన్ అపర్ణ 349 మార్కులు సాధించారు. సెకండియర్‌లో జిల్లా టాపర్‌గా సుమేరా అమైన్ 974, ఎంపీసీలో ఎండీ సానియా 911, సీఈసీలో రంగు వినయ్‌కుమార్ 799, హెచ్‌ఈసీలో కీర్తి చైతన్య 799, వొకేషనల్‌లో రేగెల్ల భాగ్య 926 మార్కులు సాధించారు. కాగా, జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు చంద్రపల్కల ప్రసాద్ అభినందించారు. టేకుమట్ల మండలం గర్మిళ్లపల్లి గ్రామానికి చెందిన ఆడెపు మణిజ్యోతి బైపీసీ మొదటి సంవత్సరంలో 437 మార్కులు సాధించి రాష్ట్రంలో సెకండ్ ర్యాంక్ సాధించింది. పంగిడిపల్లి గ్రామానికి చెందిన బీనవేణి శ్రీపూజ బైపీసీ రెండో సంవత్సరంలో 990 మార్కులతో రాష్ట్రంలో రెండో స్థానం సాధించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కాటారం గిరిజన సంక్షేమ బాలికల గురుకులంలో ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో ఇంచర్ల సుప్రియ 467, వెన్నెల 466 మార్కులతో స్టేట్ ర్యాంకులు సాధించారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీలో నిఖిత 938 మార్కులు, దీపిక 930, బైపీసీలో అనూష 932, వైష్ణవి 913 మార్కులు సాధించారు. ఒకేషనల్ కోర్సుల్లో సెకండియర్‌లో జే.అంకిత 971, మొదటి సంవత్సరంలో 488 మార్కులతో కే లావణ్య సత్తా చాటారు. మొత్తం 106 మంది విద్యార్థులకు 95 మంది ఉత్తీర్ణత సాధించగా 83.6 శాతం నమోదైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ శైలజా రాణి తెలిపారు.

గంగారం మోడల్ స్కూల్‌లో ఎంపీసీ విద్యార్థి రణధీర్ 859 మార్కులు సాధించారని, 45 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ మధు తెలిపారు. గిరిజన గురుకుల బాలుర విద్యాలయంలో మొదటి సంవత్సరంలో కేవలం 28 శాతం, సెకండియర్‌లో 73 శాతం ఉత్తీర్ణత నమోదైనట్లు ప్రిన్సిపాల్ బుచ్చయ్య తెలిపారు. కాటారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సెకండియర్‌లో విద్యార్థులు 57 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ నరేందర్ తెలిపారు. కేజీబీవీలో ఫస్టియర్‌లో 37 శాతం, సెకండియర్‌లో 92 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

టేకుమట్లలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న సిరికొండ

బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలి

ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి

టేకుమట్ల, ఏప్రిల్ 24 : త్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి సుధీర్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి కోరారు. బుధవారం మండల కేంద్రంలో జరిగే వారాంతపు సంతలో ఆయన స్థానిక నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ పార్టీలతో రాష్ట్రాభివృద్ధి జరగదని, కేసీఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఎలా ఉంది? ప్రస్తుత పరిస్థితి ఎలా మారిపోయింది? అనేది వివరించారు. ఈ ప్రాంతం అభివృద్ధి జరగాలంటే పార్లమెంట్‌లో ప్రశ్నించే బీఆర్‌ఎస్ అభ్యర్థిని గెలిపించాలన్నారు. ప్రచారంలో కార్మిక శాఖ మండల అధ్యక్షుడు నేరెళ్ల రామ కృష్ణగౌడ్, వైస్ ఎంపీపీ ఐలయ్య, బండెల నరేశ్, సదయ్య, ఉద్దమారి మహేశ్, లక్ష్మణ్, నిమ్మల స్వామి, రాకేశ్, రాజయ్య పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

కేంద్రాన్ని పరిశీలిస్తున్న చిత్రమిశ్రా, శ్రీజ

మంగపేట, ఏప్రిల్ 24 : మంగపేట మండలంలో నూతనంగా ఏర్పాటుచేసిన నాలుగు పోలింగ్ కేంద్రాలను అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి, ఐటీడీఏ పీవో చిత్రమిశ్రా, జిల్లా అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి బుధవారం పరిశీలించారు. తొండ్యాల క్ష్మీపురంలోని 214ఏ, నరేంద్రరావుపేటలోని 218ఏ, కొత్త చీపురు దుబ్బలోని 235ఏ, శనిగకుంటలోని 239ఏ పోలింగ్ కేంద్రాలను నూతనంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా చిత్రమిశ్రా సంబంధిత పోలింగ్ కేంద్రాల బీఎల్‌వోలతో మాట్లాడారు. కేంద్రాల వద్ద ర్యాంప్స్, లైటింగ్, ఎలక్ట్రిసిటీ, తాగునీరు, టాయిలెట్స్ తదితర సదుపాయాలు ఏర్పాటు చేయాలని సూచించారు. వారి వెట ఎంపీడీవో కృష్ణ ప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ మల్లేశ్వరరావు, ఆర్ఐ శ్రీనివాస్, బీఎల్‌వోలు మంకిడి శివ, తాటి సునీత, కొమరం చంద్రకళ, పెండ్యాల సుజాత తదితరులున్నారు.

నీటి కొరత లేకుండా చూడాలి

మండల సభలో భూపాలపల్లి ఎంపీపీ లావణ్య

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 24 : మండలంలోని గ్రామాల్లో నీటి కొరత, కరెంట్ సమస్యలు లేకుండా చూడాలని భూపాలపల్లి ఎంపీపీ మండల లావణ్య అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం జిల్లా కేంద్రంలోని జడ్పీ సమావేశ మందిరంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మిగిలి పోయిన అభివృద్ధి పనులను పూర్తి చేయాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకు పౌష్టికాహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను కోరారు. వేసవి దృష్ట్యా ఉపాధి హామీ కూలీలు తగు జాగ్రత్తలు పాటించాలని, వడదెబ్బ తగలకుండా ఆరోగ్య అధికారులు చర్యలు చేపట్టాలని ఎంపీపీ సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎండీ ఇక్బాల్ హుస్సేన్, తహసీల్దార్ శ్రీనివాస్, సర్పంచ్‌లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

తల్లుల దీవెనలతో పల్లెలు సల్లగా ఉండాలి

టేకుమట్ల, ఏప్రిల్ 24 : పోచమ్మ తల్లి, బొడ్రాయి, భూలక్ష్మి, మహాలక్ష్మి తల్లుల దీవెనలతో పల్లెలు సల్లగా ఉండాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు, ఎమ్మెల్సీ సిరికొండ మధుసూదనాచారి, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి అన్నారు. మండలంలోని మందలోరిపల్లిలో పోచమ్మ, బొడ్రాయి ప్రతిష్ఠాపన కార్యక్రమానికి వారు వేర్వేరుగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని నిర్వాహకులు సన్మానించారు.

ప్రేమ ఒకరితో.. పెళ్లి మరొకరితో..

చిట్యాల ఫంక్షన్ హాల్‌లో ప్రియుడిని నిలదీసిన యువతి

అదుపులోకి తీసుకొని సంగెం పోలీస్ స్టేషన్‌కు తరలింపు

చిట్యాల, ఏప్రిల్ 24 : ప్రేమ పేరుతో యువతిని పెళ్లి చేసుకుంటానని చెప్పి మరో యువతితో పెళ్లికి సిద్ధపడిన ఘటన బుధవారం జూకల్ ఫంక్షన్ హాల్‌లో జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. వరంగల్ నగరంలోని దేశాయిపేటకు చెందిన మునుగొండ ప్రశాంత్ అదే ప్రాంతానికి చెందిన లింగాల రవళి ప్రేమించుకున్నారు. పెళ్లి చేసుకుంటానని చెప్పి హఠాత్తుగా కనిపించకపోవడంతో యువతి ఆరా తీయగా బుధవారం చిట్యాల మండలానికి చెందిన మరో అమ్మాయితో ప్రేమపెళ్లి చేసుకుంటున్నట్లు తెలిసింది. దీంతో కుటుంబ సభ్యులతో కలిసి రవళి ఫంక్షన్ హాల్‌కు చేరుకొని ప్రశాంత్‌ను నిలదీసింది. ఇరు కుటుంబాల మధ్య గొడవ జరగడంతో పోలీసులు అక్కడికి చేరుకున్నారు. ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకొని విచారించారు. బాధితురాలు ఈనెల 22న సంగెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ప్రశాంత్‌ను సంగెం పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు చిట్యాల ఎస్సై శ్రావణ్‌కుమార్ చెప్పారు.

మాట్లాడుతున్న ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

ఎన్‌పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి

కృష్ణకాలనీ, ఏప్రిల్ 24 : విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా ప్రజలకు నాణ్యమైన కరెంట్ అందించాలని ఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. బుధవారం సింగరేణి గనుల వృత్తి శిక్షణ కేంద్రం కాన్ఫరెన్స్ హాలులో భూపాలపల్లి ఆపరేషన్ సర్కిల్ పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న జేఎల్‌ఎం, ఏఎల్‌ఎం, లైన్‌మెన్, లైన్ ఇన్‌స్పెక్టర్లు, సీనియర్ లైన్‌మెన్, ఫోర్‌మెన్లకు నిర్వహించిన రెండో రోజు శిక్షణ కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. వినియోగదారులతో మర్యాదగా ప్రవర్తించాలని, విద్యుత్ శాఖకు మంచిపేరు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జనరల్ మేనేజర్ (కమర్షియల్) బీకంసింగ్, భూపాలపల్లి ఎస్ఈ మల్చూర్ నాయక్, డీఈ నాగరాజు, ఏడీలు, ఏఈలు, విద్యుత్ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మావోయిస్టు కుటుంబానికి పరామర్శ

చిట్యాల, ఏప్రిల్ 24 : ఇటీవల ఎన్‌కౌంటర్‌లో మృతి చెందిన మండలంలోని చల్లగరిగ గ్రామానికి చెందిన మావోయిస్టు నేత సిరిపెల్లి సుధాకర్ అలియాస్ శంకర్‌రావు కుటుంబాన్ని రాష్ట్ర మంత్రి సీతక్క, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం పరామర్శించారు. సుధాకర్, అతడి భార్య సుమన అలియాస్ రజిత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. సుధాకర్ తల్లి రాజపోశమ్మతో ముచ్చటించి కుటుంబ స్థితిగతులపై ఆరా తీశారు. సీతక్క వెంట కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి గాజర్ల అశోక్, టేకుమట్ల జడ్పీటీసీ పులి తిరుపతిరెడ్డి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గుమ్మడి శ్రీదేవి, మండలాధ్యక్షుడు గూట్ల తిరుపతి తదితరులున్నారు.

విద్యార్థుల సంఖ్యను పెంచాలి

ఏటూరునాగారం, ఏప్రిల్ 24 : వచ్చే విద్యా సంవత్సరంలో విద్యార్థుల సంఖ్యను పెంచాలని గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ పోచం సూచించారు. మండలంలోని చిన్నబోయినపల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాలలో బుధవారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని గిరిజన ఆశ్రమ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోచం మాట్లాడుతూ విద్యా సంవత్సరం ముగిసిపోయిందని, వచ్చే విద్యా సంవత్సరానికి అవసరమైన మౌలిక వసతులు, ఆహార పదార్థాల ఇండెంట్‌ను అందించాలన్నారు. సమావేశంలో ఏటీడీవో దేశీరాంనాయక్, డిప్యూటీ ఈవో సారయ్య, ఏసీఎంవో రవీందర్, ఏపీసీఎంవో వాగ్యానాయక్, జీసీడీవో సుగుణ పాల్గొన్నారు.

పోస్టుకార్డులు రాస్తున్న దళిత బంధు కమిటీ సభ్యులు

దళిత బంధు నిధులు విడుదల చేయాలంటూ..

కాటారంలో పోస్టుకార్డు ఉద్యమం

కాటారం, ఏప్రిల్ 24: దళిత బంధు పథకం నిధులను వెంటనే విడుదల చేయాలని మండల కేంద్రంలో పోస్టుకార్డు ఉద్యమం చేపట్టారు. ఈ మేరకు అంబేద్కర్ చౌరస్తా వద్ద మంథని డివిజన్ పరిధిలోని లబ్ధిదారుల కమిటీ సభ్యులు బుధవారం రాష్ట్ర ప్రభుత్వానికి వెయ్యి ఉత్తరాలను పంపించారు. దళిత బంధు పథకాన్ని కొనసాగించని పక్షంలో రాబోయే రోజుల్లో తెలంగాణ వ్యాప్తంగా లక్ష ఉత్తరాల ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం స్పందించకుంటే దళిత బంధు సభ్యులు ఎంపీ ఎన్నికల్లో నామినేషన్లు వేయాలని తీర్మానించినట్లు తెలిపారు. పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరగబోయే నామినేషన్‌కు అధిక సంఖ్యలో దళిత బంధు సభ్యులు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు సంపత్, కిరణ్, బాలరాజు, మమత, నగేశ్, రాజు తదితరులున్నారు.

వాహనాల తనిఖీల్లో నగదు స్వాధీనం

తాడ్వాయి, ఏప్రిల్ 24 : ఎలాంటి ఆధారాలు లేకుండా నగదు తీసుకెళ్తుండగా బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండల కేంద్రంలోని కాటాపురం క్రాస్ వద్ద ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, సివిల్, సీఆర్‌పీఎఫ్ పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తున్నారు. కాటాపురానికి చెందిన వ్యాపారి పాలకుర్తి సాయిబాబా బొలెరో వాహనంలో వస్తుండగా అతడిని తనిఖీ చేయగా రూ.60 వేలు ఉన్నట్లు గుర్తించారు. ఎలాంటి ఆధారాలు చూపకపోవడంతో డబ్బులను స్వాధీనం చేసుకుని ములుగు జిల్లా గ్రీవెన్స్ కమిటీకి అప్పగించినట్లు ఎస్సై తెలిపారు.

పోలింగ్ కేంద్రాలను సందర్శించిన ఏఎస్పీ

వెంకటాపురం (నూగూరు), ఏప్రిల్ 24 : మండలంలోని అలుబాక, కొండాపురం, సూరవీడు, విజయపురి కాలనీ, ఎదిర పోలింగ్ కేంద్రాలను ఏటూరునాగారం ఏఎస్పీ గీతే మహేశ్‌బాబా సాహెబ్ బుధవారం సందర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో మావోయిస్టు కదలికలపై అప్రమత్తంగా ఉండాలని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఆయన వెంట సీఐ బండారి కుమార్, ఎస్సై తిరుపతిరావు, సివిల్ సిబ్బంది ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగి మృతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 25 : ఏటూరునాగారం–కమలాపురం మధ్యలోని జీడివాగు వద్ద మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని లాథూర్ జిల్లా అమంతాపూర్ తాలుకా దేవకరా గ్రామానికి చెందిన సీఐఎస్‌ఎఫ్ ఉద్యోగి అనిల్ సుర్వోషి (40) మృతి చెందాడు. ఎస్సై కృష్ణ ప్రసాద్ కథనం మేరకు ఒడిశా రాష్ట్రంలోని దామన్‌గొడి సీఐఎస్‌ఎఫ్ క్యాంపులో అనిల్ సుర్వోషి డ్రైవర్, ప్లంబర్‌గా పనిచేస్తున్నాడు. భార్య అయోధ్య, కుమారుడు రాజ్‌వీర్‌తో కలిసి మహారాష్ట్రంలోని తన బంధువుల ఇంట్లో పెండ్లికి కారులో వెళ్తున్న క్రమంలో జీడివాగు సమీపంలో ఎదురుగా వచ్చిన లారీని తప్పించబోయి చెట్టుకు ఢీ కొట్టాడు. దీంతో బలమైన గాయాలతో అనిల్ సుర్వోషి అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ విషయాన్ని గుర్తించిన వాహనదారులు ఏటూరునాగారం పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై కృష్ణ ప్రసాద్ ఘటనా స్థలానికి చేరుకుని గాయపడిన మృతుడి భార్య అయోగ్య, కుమారుడు రాజ్‌వీర్‌ను వైద్యశాలకు తరలించారు. మృతుడి తమ్ముడు బ్రహ్మదేవ్ సుర్వోషి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

భార్యతో గొడవపడి భర్త ఆత్మహత్య

గణపురం, ఏప్రిల్ 24 : భార్యతో గొడవపడి పురుగుల మందు తాగి భర్త ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని కుందూరుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన అల్లం ఐలయ్య (65) ఆదివారం సాయంత్రం భార్యతో గొడవపడి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు సమీపంలోని 100 పడకల ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం పరకాలలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ఐలయ్య కుమారుడు మధుకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మచ్చ సాంబమూర్తి తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

గణపురం, ఏప్రిల్ 24 : రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం మృతి చెందాడు. ఎస్సై మచ్చ సాంబమూర్తి కథనం మేరకు మండలంలోని మైలారం శివారు కొత్త పెట్రోల్ బంక్ సమీపంలో పరకాల–భూపాలపల్లి జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి టాటా ఏస్‌ను బైక్ ఢీకొన్న ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. వారిలో మండల కేంద్రానికి చెందిన కొలిపాక రాజు ఎంజీఎంలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి అక్క కోలెపాక అన్నపూర్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

టిప్పర్ ఢీకొని ఐదు పాడి గేదెలు మృతి

ఏటూరునాగారం, ఏప్రిల్ 24 : టిప్పర్ ఢీకొని ఐదు పాడి గేదెలు మృతి చెందిన ఘటన మండలంలోని చిన్నబోయినపల్లి జాతీయ రహదారిపై బుధవారం చోటు చేసుకుంది వివరాల్లోకి వెళితే.. మేతకు వెళ్తున్న గేదెల మందను మల్లంపల్లి నుంచి ఏటూరునాగారం వైపు వస్తున్న టిప్పర్ ఢీకొంది. దీంతో ఐదు పాడి గేదెలు మృతి చెందగా, మరో నాలుగు గాయపడ్డాయి. మృతి చెందిన గేదెల విలువ సుమారు రూ. 1.50 లక్షల వరకు ఉంటుందని చిన్నబోయినపల్లి వాసులు తెలిపారు.

కాంగ్రెస్ మాటలను నమ్మి మోసపోవద్దు

- బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్
- మహదేవపూర్‌లో కార్నర్ మీటింగ్

మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్

మహదేవపూర్, ఏప్రిల్ 24 : కాంగ్రెస్ మాయ మాటలను ప్రజలు నమ్మి మోసపోవద్దని, బీఆర్‌ఎస్ హయాంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని బీఆర్‌ఎస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ అన్నారు. బుధవారం సాయంత్రం మండలకేంద్రంలో జరిగి కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి ఇప్పుడు అమలు చేయడంలేదన్నారు. ప్రజా సంక్షేమమే తమ ధ్యేయమని, బీఆర్‌ఎస్‌తోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. దేశంలో ఎక్కడా జరగని అభివృద్ధి కేసీఆర్ నేతృత్వంలో జరిగిందని గుర్తు చేశారు. పెద్దపల్లి జడ్పీ చైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ కాంగ్రెస్ గ్యారెంటీ పథకాలు అమలు చేయలేక సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్లపై ఒట్టు వేసే పరిస్థితి దాపురించిందన్నారు. కొప్పుల ఈశ్వర్‌ను ఎంపీగా భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. మంత్రి శ్రీధర్‌బాబు ప్రజలు చేసిందేమీలేదన్నారు. తాను ఎమ్మెల్యేగా గెలిచి కేసీఆర్ నేతృత్వంలో మారుమూల ప్రాంతాల్లో అనేక వంతెనలు, రహదారులు, భవనాలు నిర్మించానని గుర్తు చేశారు. సమావేశంలో బీఆర్‌ఎస్ పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి వెంకటరమణారెడ్డి, రాష్ట్ర యువజన నాయకుడు జక్కు రాకేశ్, మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాస్‌రావు, మాజీ సర్పంచ్ శ్రీపతిబాపు, నియోజకవర్గ మహిళా ఇన్‌చార్జి కేదారి గీతాబాయి, మహిళా మండల అధ్యక్షురాలు ఓడేటి స్వప్న, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పారదర్శక ఎన్నికలకు సహకరించాలి

- భూపాలపల్లి కలెక్టర్ భవేశ్‌మిశ్రా

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ భవేశ్ మిశ్రా

భూపాలపల్లి రూరల్, ఏప్రిల్ 24 : పార్లమెంట్ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ పార్టీల నాయకులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘనల పై నేరుగా జిల్లా ఎన్నికల అధికారి కార్యాలయంలో, సీ–విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. అలాగే 1950 నంబర్‌తో కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూ మ్‌కు సమాచారం ఇవ్వొచ్చన్నారు. ప్రచార కార్యక్రమాలకు సింగిల్ విండో సిస్టం ద్వారా అనుమతులు మంజూరు చేస్తామన్నారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు లౌడ్ స్పీకర్లు, ప్రచారానికి అనుమతి లేదన్నారు. ఎండ తీవ్రత దృష్ట్యా ఓటర్లు ఉదయమే పోలింగ్ కేంద్రాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. మే 2 నుంచి 8 వరకు భూపాలపల్లి ప్రభు త్వ డిగ్రీ కళాశాలలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటుహక్కు వినియోగించుకోవడానికి ఫెసిలిటేషన్ కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఎన్నికల వ్యయానికి సంబంధించిన ఖర్చుల వివరాలలో ఏదైనా సమస్యలు ఏర్పడితే వ్యయ పరిశీలకులు ధీరజ్‌సింగ్‌ను 8902199830 నంబర్‌లో సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, డీపీఆర్వో శ్రీనివాస్, ఆర్డీవో మంగీలాల్, బీఆర్‌ఎస్ నాయకుడు సీహెచ్ ప్రవీణ్, ఆమ్‌ఆద్మీ నాయకుడు సాయితేజ, కాంగ్రెస్ నాయకుడు అశోక్ పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
SepTeK
★సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్ఫర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043.
NTW-323227

WANTED
jobs Apply Now!
★Wanted PRO's for degree College admissions (22 years Experience College). Contact Immediatly Cell: 8121554649
NTW-323199

బిజినెస్ ఆఫర్

★స్త్రీ/పు అవకాశం తక్కువ పెట్టుబడితో 25 రకాల వెజ్–నాన్ వెజ్ పచ్చళ్ళు షాపుని మీ ఏరియాలో స్థాపించి నెలకు 30 వేలు ఆపైన ఆదాయం పొందండి. సెల్: 8143909459.
NTW-000

★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం: 16K to 18K ఏజెంట్ కమీషన్. 6K. Ph: 9640258899, 9640468899.
NT-311831-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

అతి తక్కువ ఖర్చు అత్యధిక ప్రచారం

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం: 9182777552
HANAMKONDA 9182777563 9182777618
WARANAGAL 9182777556 9182777557
JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565